క్లుప్తంగా

వైద్యాధికారికి వీడ్కోలు


శ్రీవిద్యను సత్కరిస్తున్న డాక్టర్ సీతారామలక్ష్మి, సిబ్బంది

మాకవరపాలెం: పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవిద్యకు సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో గత నాలుగేళ్లుగా శ్రీవిద్య వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. అయితే ఆమెకు పీజీ సీటు రావడంతో వైద్యాధికారి బాధ్యతల నుంచి గురువారం రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌లో మరో వైద్యాధికారి సీతారామలక్ష్మి, ఇతర సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న అన్ని విభాగాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీని కుదేలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

చోడవరం రూరల్: సహకార రంగంలో కొనసాగుతున్న చోడవరం సుగర్స్‌ను కూటమి ప్రభుత్వం కుదేలు చేస్తుందని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోన మోహనరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఏనాడూ లేని విధంగా పెద్ద పండగ పోయాక క్రషింగ్ ప్రారంభించి రోజుల తరబడి అవాంతరాలతో నెట్టుకొచ్చారన్నారు. అయినా రోజుల తరబడి చెరకు బండ్లు, పశువులతో కళ్లు కాయలు కాచేలా పస్తులతో రైతాంగం ఎదురు చూసి విసిగిపోయి నేడు ఆగ్రహంతో రోడ్డెక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ సజావుగా నడపడానికి విడుదల చేసిన నిధులు ఎక్కడికి చేరాయని, ఖర్చు చేసినట్లయితే క్రషింగ్‌లో ఎడతెరపి లేని ఈ ఆటంకాలు దేనికని నిలదీశారు. ఫ్యాక్టరీని రానురాను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటు పరం చేయడానికా అని ప్రశ్నించారు.

టైలర్స్ డే వేడుకలు నేడు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ ఉమామహేశ్వర టైలర్ల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. దేవరాపల్లి తోటలో కేక్ కటింగ్, సీనియర్ టైలర్లకు సత్కారం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం టైలర్ల సంక్షేమం కోసం చర్చిస్తామన్నారు.

1న గౌరీశంకరుల మహోత్సవం

పాయకరావుపేట: మండలంలో సత్యవరం గ్రామంలో వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించే గౌరీశంకరుల మహోత్సవ గోడపత్రికను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తమ్మిర్సి గంగారావు, బోయిడి బుల్లాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం


వీరవల్లి అగ్రహారం సచివాలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారం సచివాలయం, రైతు భరోసా కేంద్రం చుట్టు ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నట్లు స్థానిక గ్రామ సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు తెలిపారు. మండల నిధులు రూ. 5 లక్షల వ్యయంతో 120 మీటర్ల పొడవున ప్రవహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రహరీ లేక ప్రజలు ఇబ్బంది పడ్డామన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అన్న సమారాధన


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరుకొండ జగదీష్

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద 31వ ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు కోరుకొండ జగదీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, వీరబ్రహేంద్ర స్వామి గోవింద మాంబ కల్యాణం కమిటీ సభ్యులు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతం


మాడుగులలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు


నర్సీపట్నంలో ఓటర్ గుర్తింపు కార్డులు చూపుతున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 95.20 శాతం ఓటింగ్ జరిగింది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 417 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 255, మహిళలు 162 మంది ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 397 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 236, మహిళలు 161 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.ఎం.నాయక్ పరిశీలించారు. పోలింగ్ వివరాలను ఆర్డీవో వి.వి.రమణకు పరిశీలకులు వివరించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రామారావు ఉన్నారు. పోలింగ్ నేపథ్యంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్, పీడీఎఫ్ ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులను తమ శిబిరాల్లోకి ఆహ్వానించి మద్దతు కోరారు. ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా స్పీకర్ తనయుడు సీహెచ్ రాజేష్, టీడీపీ నాయకులు శిబిరంలో తిష్ట వేశారు.

నియోజకవర్గంలో ప్రశాంతం..

చోడవరం: నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చోడవరంలో 306 ఓట్లకు గాను 296 పోలయ్యాయి. 10 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. రోలుగుంట మండలంలో 48 ఓట్లకు 48 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రావికమతంలో 52 ఓట్లకు 51 ఓట్లు పోలవ్వగా, బుచ్చెయ్యపేలో 34కి 33 ఓట్లు పోలయ్యాయి.

మాడుగులలో 96.36 శాతం..

మాడుగుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 55 మంది ఓటర్లకు గాను 53 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 39 మందికి గాను 38 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్త్రీలు 16 మందికి గాను 15 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎఈఆర్‌వో రమాదేవి తెలిపారు. ఎస్‌ఐ నారాయణరావు, పోలీసులు, ఎన్నికల సిబ్బంది సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

వందశాతం..

మాకవరపాలెం: మండల వ్యాప్తంగా 53 ఓట్లు ఉండగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 53 ఓట్లు పోలయ్యాయి. ఎస్‌ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా, ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రశాంతంగా ఓటింగ్..

రోలుగుంట: మండలంలో ఉన్న 48 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో 91వ పోలింగ్ కేందాన్ని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి పర్యవేక్షించారు. ప్రొసీడింగ్ అధికారిగా సోమశేఖర్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారిగా గాయిత్రి, మైక్రో అబ్జర్వర్‌గా వై.నాగేశ్వరావు వ్యవహరించారు. ఎన్నికల బరిలో 10 మంది నిలవగా మండలంలో మాత్రం ఏపీటీఎఫ్, పీఆర్టీయూ మధ్యే పోటీ జరిగింది. తహసీల్దార్ ఎస్. నాగమ్మ పర్యవేక్షణలో మౌలిక సదుపాయాలు కల్పించారు.

నాతవరంలో 97.18 శాతం..

నాతవరం: మండలంలో పురుష ఓటర్లు 48, మహిళా ఓటర్లు 23 మంది కలిపి మొత్తం 71 మంది నాతవరం పాఠశాలలో ఓటు వేశారు. పోలింగ్ కేంద్రం నంబరు 97లో పురుషులు 46 మంది, మహిళలు 23 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చమ్మచింత గ్రామానికి చెందిన దొడ్డిగొల్లు సుబ్రహ్మణ్యం పేర డబుల్ ఎంట్రీగా నమోదు అయింది. ఎం. బెన్నవరం గ్రామానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు తన ఓటు వినియోగించుకోలేదు. మొత్తం 69 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించకున్నారని ఎన్నికల అధికారి కె. ఉమా ప్రసాద్ తెలిపారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 107 మందికి 102 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఈ పోలింగ్ కార్యక్రమం జరిపారు. పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రలను స్థానిక ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ తదితరులు పర్యవేక్షించారు.


రోలుగుంట ఎంపీపీ పాఠశాలను సందర్శించిన అనకాపల్లి డీఎస్పీ శ్రావణి


చోడవరం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు

రావికమతంలో 100 శాతం..

రావికమతం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఈ పోలింగ్‌లో 52 మంది ఓటర్లకు గాను 52 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 100 శాతం ఓటింగ్ జరిగింది.

గొలుగొండలో..

గొలుగొండ: గొలుగొండ ప్రాథమిక పాఠశాలలో 80 ఓట్లకు గాను 78 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నిక జరిగిందని ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పూర్తి స్థాయిలో సహకారం అందించినట్లు చెప్పారు.

దేవరాపల్లిలో 98.41 శాతం..

దేవరాపల్లి: మండలంలో 63 మంది ఓటర్లు ఉండగా వీరిలో 62 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెరసి 98.41 శాతం పోలింగ్ నమోదయింది. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు, అదనపు ఎస్‌ఐ పి. రాములమ్మ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాలు శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశాయి.


చోడవరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్ తదితరులు


దేవరాపల్లిలో ఓటు వేసి సిరా మార్కు చూపిస్తున్న ఉపాధ్యాయ ఓటర్లు


గొలుగొండలో ఓటు వేయడానికి వచ్చిన ఉపాధ్యాయుడు


కె.కోటపాడు పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

ఘనంగా పోతురాజుబాబు పండగ


అన్న సమారాధనలో భక్తులు

రోలుగుంట: రోలుగుంటలో మద్దు వల్లయ్య, అచ్చియ్య, యర్రోదు కుటుంబీకులు పోతురాజు బాబు పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కల్యాణపులోవ, బలిఘట్టం పుణ్య స్నానాలకు వెళ్లి వచ్చే భక్తులు కూడా అన్నసమారాధనకు హాజరయ్యారు.

నేడు వేంకటేశ్వరస్వామి తల నీలాలకు వేలం పాట

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది వేంకటేశ్వరస్వామి తలనీలాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో శర్మ తెలిపారు. 2025 మార్చి 1వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఏడాది కాలానికి భక్తులు సమర్పించిన తలనీలాలు అమ్ముకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ. 5 వేలు ధరావతు ముందుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


కె.కోటపాడులో గల గౌరీపరమేశ్వరులు

కె.కోటపాడు: గ్రామంలోని గౌరీపరమేశ్వరుల ఆలయ 9వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుండి గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించనున్నారు. భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించాలని గౌరీ పరమేశ్వరుల ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన జనం

- కోలాహలంగా మారిన ఉత్తర వాహిని ప్రాంతం


డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు


మాడుగుల శ్రీకృష్ణ భూపాలేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఉత్తరవాహిని నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రెండవ రోజు భక్తులు పోటెత్తారు. ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహా శివరాత్రి మరుసటి రోజు ఉత్తరవాహినిలో అమావాస్య స్నానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం రాత్రి ధారమతం, కల్యాణపు లోవలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జాగారం చేసి, గురువారం బలిఘట్టం తరలి వచ్చి ఉత్తరవాహినిలో స్నానాలు ఆచరించి బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. బుడగ జంగాలచే పితృదేవతలను మననం చేసుకున్నారు. దంపతులకు బ్రాహ్మణులు బ్రహ్మముడులు వేసి ఆశీర్వచనాలు అందించారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఎస్ఏఎస్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు భక్తులకు మజ్జిక ప్యాకెట్లు అందజేశారు. సమీపంలోని కొండపై ఉన్న మహర్షి ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు డ్రోన్ కెమెరాతో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కిటకిటలాడిన స్నాన ఘట్టాలు..

చోడవరం: మూడు నదుల సంగమమై పవిత్ర స్నానరేవుగా ప్రసిద్ధి గాంచిన ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయ స్నాన ఘట్టంలో వేలాది మంది భక్తులు స్నానాలు చేశారు. సంగమేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం పక్కనే ఉన్న కోనేరులో మహిళలు దీపాలు వెలిగించి, పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేశారు. శారద, పెద్దేరు, బొడ్డేరు నదీ పరివాహకంలో గౌరీపట్నం వద్ద ఉన్న మార్కమ్మ రేవు, గవరవరం, జుత్తాడ, అంబేరుపురం రేవుల వద్ద భక్తులు స్నానాలు ఆచరించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు..

బుచ్చెయ్యపేట: గురువారం తెల్లవారు జామున పెద్దేరు, తాచేరు, బొడ్డేరు తదితర పుణ్య నదుల్లో భక్తులు స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెదమదీన శివాలయంలో లింగాకారంలో దీపాలు వెలిగించారు. వడ్డాది భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, నవ ఫలాల రసాలు, పంచామృతాలతో పాటు క్షీరాభిషేకాలు చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం..

మాడుగుల: స్థానిక శ్రీకృష్ణభూపాలేశ్వరాలయంలో గురువారం తెల్లవారున శివపార్వతులు కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జంపెన గుప్త లింగేశ్వరాలయం, మాడుగులలో వెలసిన ఉబ్బలింగేశ్వరాలయం, భీమలింగేశ్వరాలయం, జాలంపల్లి ఉమా భీమలింగేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు. స్థానిక పురాతన పార్థసారథి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారాధాచార్యులు ఆధర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయాల్లో భక్తుల పూజలు..

కె.కోటపాడు: స్థానిక భీమలింగేశ్వరాలయం, చౌడువాడలో గల కాశీ విశ్వేశ్వరాలయం, ఆర్లిలో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు శివునికి ప్రత్యేక పూజలు చేశారు.

పోటెత్తిన భక్తజనం..

రావికమతం: మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా కల్యాణలోవ పోతురాజుబాబు, పెద్దింటమ్మ తిరునాళ్లకు రెండవ రోజు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొత్తకోట సీఐ కోటేశ్వరావు పర్యవేక్షణలో స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్ సారథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


పెదమదీనాలో లింగాకారంలో వెలిగించిన దీపాలు

ఘనంగా ముగిసిన శివరాత్రి వేడుకలు..

మాడుగుల రూరల్: కె.జె.పురంలోని పురాతన శివాలయంలో బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి గురువారం ఉదయం 5 గంటల వరకు ఏకాహం (భజన కార్యక్రమం) నిర్వహించారు. యల్లపు పెంటయ్య మాస్టారు సారథ్యంలో 2500 దీపాలతో ఆలయంలో భక్తులు దీపార్చన చేశారు. ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, వీరవల్లి అగ్రహారం శివాలయంలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఉమా భీమలింగేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా అలకరించారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల మహంకాళేశ్వర ఆలయంలో శివలింగానికి భక్తులు అభిషేకం నిర్వహించారు. వంటర్లపాలెం శివాలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు. వీరనారాయణం, పిట్టగెడ్డ, వి.వి.అగ్రహారం, విస్సారపు వారి కళ్లాల వద్ద గల నీలకంఠేశ్వరునికి సామూహిక భజన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులతో నిండిపోయిన ధారమతం..

గొలుగొండ: మహా శివరాత్రి రెండవ రోజు ధారమఠానికి భక్తులు భారీగా వచ్చారు. గురువారం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ రామారావు భారీ బందోబస్తు నిర్వహించారు. పైల ప్రసాద్ అనే భక్తుడు సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమరాధన నిర్వహించారు.


కళ్యాణలోవ రిజర్వాయరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వి.వి.అగ్రహారం ఉమా భీమలింగేశ్వరుడు


కె.జె.పురం శివాలయం వద్ద మహిళల కోలాటం

ఉల్లాసంగా తీర్థ మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో కర్రి రామునాయుడు విగ్రహం


పరుగు పందెంలో దౌడు తీస్తున్న గుర్రం

కె.కోటపాడు: గుల్లేపల్లిలో సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుండి సీతారాముల ఆలయంలో భక్తులు పూజలు చేశారు. జిల్లా స్థాయి గుర్రం పరుగు పందేలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ సభ్యుడు కశిరెడ్డి దేముడుబాబు పాల్గొన్నారు.

కె.జె.పురంలో కర్రి రామునాయుడు తీర్థం..

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోవు రహదారిలో గల కీర్తిశేషులు కర్రి రామునాయుడు విగ్రహం వద్ద గురువారం తీర్థం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులు కర్రి రామకృష్ణ సారథ్యంలో విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అన్నసమారాధన జరిగింది. ప్రముఖ ఎముకల వైద్యుడు డాక్టర్ రాపేట రాజుబాబు దంపతులు, నియోజవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి నాగమణి కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి


నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న కలాం సేవా సంఘం సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చంద్రశేఖర్ ఆజాద్ 94 వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బ్రిటీషర్ల చేతిలో చావడం కంటే ఆత్మహత్యే మేలని దేశం కోసం ప్రాణాలొదిన మహా వీరుడని, దేశానికి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ కన్వీనర్ కొణతాల హరనాథ్, దిలీప్, ఆజాద్, నర్సింగరావు, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ ఏర్పాటు


పూర్వ విద్యార్థులు సమకూర్చిన సైకిల్‌స్టాండ్

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమవంతు సాయం అందజేస్తున్నారు. ఇదే స్కూల్‌కు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గతంలో కళావేదికను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా మరో అడుగు ముందుకేసి విద్యార్థులకు అవసరమయ్యే సైకిల్ స్టాండ్‌ను సమకూర్చారు. వేసవిలో సైకిళ్లు ఎండలో ఉండిపోవడంతో తరచూ పంక్చర్లు అవుతుండడాన్ని గమనించి స్టాండ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఔదార్యం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీజే సౌండ్ బాక్స్ వితరణ

మునగపాక: స్థానిక వినాయక దేవాలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా లక్ష్మీ గణపతి బృందం కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. బృంద కళాకారులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డీజే సౌండ్ బాక్స్ సమకూర్చారు. దీన్ని వైఎస్సార్‌సీపీ నేత ఆడారి కాశీబాబు బుధవారం రాత్రి అందజేశారు. కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.